

ఆకట్టుకుంటున్న గాలిపటాలు

గరుడ పక్షి, సీతాకోక చిలుక తదితర ఆకృతుల్లో తయారు చేసిన గాలిపటాలు ఆకట్టుకుంటున్నాయి. 8లో



తీరమంతా కళేబరాలే..

విశాఖ నగర పరిధి భీమిలి బీచ్ రోడును ఆనుకుని తీరం పొడవునా తాబేళ్ల కళేబరాలు దర్శనమిస్తున్నాయి. 8లో



వేడుకగా నగర సంకీర్తన

విశాఖ నగరంలోని వాసుదేవ అన్నమయ్య పద సంకీర్తన సంస్థ సభ్యులు ఉత్సవ విగ్రహాలతో నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు.

న్యూస్‌రీల్

కాఫీలో నాణ్యమైన దిగుబడులు సాధించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్
- రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచన



చింతపల్లిలోని ఎకో కాఫీ పల్పింగ్ యూనిట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చింతపల్లి: మన్యంలో కాఫీ దిగుబడుల పెంపుతోపాటు నాణ్యతపెంపుపై రైతులు దృష్టిసారించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన చింతపల్లిలో పర్యటించారు. కాఫీరైతు ఉత్పత్తిదారుల సంఘం మాక్స్ ఆధ్వర్యంలో నడుస్తున్న కాఫీ ఎకో పల్పింగ్ పరిశ్రమను సందర్శించారు. రైతులు తీసుకువస్తున్న కాఫీ పండ్ల నాణ్యతను పరిశీలించారు. పల్పింగ్ కేంద్రంలో జరుగుతున్న ప్రాసెసింగ్ విధానాన్ని తెలుసుకున్నారు.

కేకే లైన్‌లో రైళ్ల గమ్యం కుదింపు

తాటిచెట్లపాలెం(విశాఖ): భద్రతాపరమైన ఆధునికీకరణ పనుల నిమిత్తం కేకే లైన్‌లో నడిచే పలు రైళ్లు ఆయా తేదీల్లో జగదల్‌పూర్ వరకే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు.

- ఈ నెల 6న విశాఖపట్నం–కిరండూల్(58501) పాసింజర్ జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో ఈ నెల 7వ తేదీన కిరండూల్–విశాఖపట్నం (58502) పాసింజర్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది.
- ఈ నెల 5వ తేదీన విశాఖపట్నం–కిరండూల్ (18514) నైట్ ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ వరకు మాత్రమే నడుస్తుంది, తిరుగు ప్రయాణంలో ఈ నెల 6వ తేదీన కిరండూల్– విశాఖపట్నం(18513) ఎక్స్‌ప్రెస్ జగదల్‌పూర్ నుంచి బయల్దేరుతుంది.

ఆదివాసీలకోసం పోరాడే వారినే ఎన్నుకోండి

- ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్



అరకులోయ టౌన్: ఈనెల 3,4 తేదీల్లో ప్రభుత్వం గ్రామ సభల ద్వారా నిర్వహించనున్న పీసా ఎన్నికల్లో ఆదివాసీల చట్టాలు, హక్కుల రక్షణకై పోరాడే అభ్యర్థులను మాత్రమే ఎన్నుకోవాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం పీసా కమిటీ ఉపాధ్యక్షుడు, కార్యదర్శి స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తోందన్నారు. ఆదివాసీల చట్టాలు, హక్కుల రక్షణపై పోరాడే వారు లేకపోవడం వల్ల అవి నిర్వీర్యం అవుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో చట్టాలు, హక్కులపై అవగాహన ఉన్నవారిని మాత్రమే ఎన్నుకుంటే ఆదివాసీలకు న్యాయం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.


జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు చింతపల్లి విద్యార్థి

- ప్రతిభ కనబరిచిన మహేష్
- పలువురి అభినందన



చింతపల్లి: జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు చింతపల్లి ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థి సీహెచ్ మహేష్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి తెలిపారు. కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి మహేష్ రెజ్లింగ్ పోటీల్లో రాణిస్తున్నాడన్నారు. ఇటీవల ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనపరిచిన మహేష్ పంజాబ్‌లోని గురుకాశీ విశ్వవిద్యాలయంలో ఈనెల 10 నుంచి 12 వరకూ జరిగే రెజ్లింగ్ పోటీలకు ఎంపికయినట్టు ఆమె తెలిపారు. మహేష్‌ను ప్రిన్సిపాల్, పీడీ శివరాంకుమార్, అధ్యాపకులు అభినందించారు.

పందెంరాయుళ్లు 28 మంది అరెస్టు



పట్టుబడిన పందెంరాయుళ్లతో పోలీసులు

వై.రామవరం: మండలంలోని పెద్దఊలెంపాడు గ్రామ సమీపంలో కోడిపందాల శిబిరంపై పోలీసులు దాడి చేసి, 28 మందిని అదుపులోకి తీసుకున్నారు. బుధవారం సాయంత్రం ఎస్‌ఐ బి.రామకృష్ణ పోలీసులు దాడులు నిర్వహించారు. పట్టుబడిన నిందితుల నుంచి రూ.8,500 నగదు, ఆరు కోడిపుంజులు, పది కోడికత్తులు స్వాధీనం చేసుకున్నారు. కోడిపందాల నిర్వహణకు కారకులైన వారిపై కూడా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు.



పోతంగి పంచాయతీ కార్యాలయానికి వచ్చిన జాంగుడ, బిజువారవలస పింఛనుదారులు

ప్రతినెలా ఠంచన్‌గా పింఛను అందిస్తున్నామని కూటమి ప్రభుత్వం చెబుతున్న దానికి క్షేత్రస్థాయిలో పరిస్థితులకు ఏమాత్రం పొంతన ఉండటం లేదు. గత ప్రభుత్వంలో ప్రతినెలా ఒకటో తేదీన పండుటాకులు పింఛను పొందేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. పోతంగి పంచాయతీకి చెందిన జాంగుడ, బిజువారవలస పింఛనుదారులు ఎదుర్కొంటున్న సమస్యే ఇందుకు ఉదాహరణ. ఈనెల రెండవ తేదీ గడిచినా ఆయా గ్రామాల్లో ఇప్పటికీ పూర్తిస్థాయిలో పింఛన్లు అందలేదు. వలంటీర్ వ్యవస్థ లేకపోవడం వల్లే తమకు ఈ దుస్థితి అని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- పింఛను ఏది బాబూ..

పండుటాకులతో ఆటలు

20 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చి.. ఉసూరుమని వెనక్కి

రెండవ తేదీ దాటినా పింఛన్లకు నోచుకోని లబ్ధిదారులు

పోతంగి పంచాయతీలో జాంగుడ, బిజువారవలస గిరిజనుల అవస్థలు

డుంబ్రిగుడ: వలంటీర్ వ్యవస్థ లేకపోవడంతో పింఛను లబ్ధిదారులు నానా అవస్థలు పడుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతినెలా ఒకటో తేదీన ఠంచన్‌గా పింఛను అందేది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి నరకం చూస్తున్నారు. ఇందుకు డుంబ్రిగుడ మండలంలోని పోతంగి పంచాయతీలో జాంగుడ, బిజువారవలస గ్రామాల గిరిజనులు ఎదుర్కొంటున్న కష్టాలు ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. ఈ పంచాయతీ పరిధిలో 36 గ్రామాలు ఉన్నాయి. వీటిలో జాంగుడ, బిజువారవలస గ్రామాలకు నెట్ వర్క్ అందుబాటులో లేకపోవడంతో తరచూ బయోమెట్రిక్ సమస్య తలెత్తుతోంది.

గత ప్రభుత్వంలో ఒకటో తేదీ వేకువజామునే..

గత ప్రభుత్వంలో నెట్‌వర్క్ సమస్య ఉన్నప్పటికీ గ్రామ వలంటీర్లు అధిగమించి వారికి ఒకటో తేదీన వేకువజామున పింఛను ఇచ్చేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో వీరి సమస్య మళ్లీ మొదటికొచ్చింది. ఆ రెండు గ్రామాల్లో సుమారు 50 మంది పింఛనుదారులు ఉన్నారు. వీరందరికీ గతనెల 31న తేదీన పింఛను అందాల్సి ఉంది. ఈ మేరకు వారంతా ఆయా గ్రామాల్లో వేచి ఉన్నారు. సిబ్బంది వెళ్లినా నెట్‌వర్క్ సమస్య కారణంగా బయోమెట్రిక్ కాలేదు. దీంతో వారు వెనక్కి వచ్చేశారు.

రోజంతా తిండిలేక..

నూతన సంవత్సరం కావడంతో జనవరి ఒకటో తేదీన పింఛను పంపిణీ జరగలేదు. దీంతో నిరాశకు గురైన ఆయా గ్రామాలకు చెందిన పింఛను లబ్ధిదారులంతా 20 కిలోమీటర్ల దూరం నుంచి గురువారం ఉదయం డుంబ్రిగుడలోని పోతంగి పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. రోజంతా పడిగాపులు పడ్డారు. పింఛను లబ్ధిదారులు 50 మందిలో 20 మందికి మాత్రమే బయోమెట్రిక్ అవ్వడంతో వారు మాత్రమే పింఛను పొందగలిగారు. మిగతా వారంతా నిరాశతో వెనుదిరిగారు.



గత నెలా ఇదే సమస్య

పింఛను పొందేందుకు గత నెలలో కూడా ఇబ్బందులు పడ్డాం. ఒకటో తేదీన కాకుండా 2, 3 తేదీల్లో పింఛన్లు తీసుకున్నాం. మూడు రోజులు గడుస్తున్నా పింఛను సొమ్ము అందలేదు. డుంబ్రిగుడ పంచాయతీ కేంద్రానికి వచ్చినా ప్రయోజనం లేకపోయింది. రోజంతా పడిగాపులు పడ్డాం.

– కిల్లో దశరథ్, జాంగుడ, పోతంగి పంచాయతీ, డుంబ్రిగుడ మండలం

వలంటీర్లు లేనందునే..

గత ప్రభుత్వంలో వలంటీర్ వ్యవస్థ వల్ల పింఛన్లు సక్రమంగా పంపిణీ జరిగేవి. ఇప్పుడు సచివాలయ సిబ్బందితో ఇంటింటికీ పంపిణీ చేయిస్తున్నామని ప్రభుత్వం చెబుతోంది. వలంటీర్ వ్యవస్థ లేకపోవడం వల్ల మేము పడుతున్న ఇబ్బందులే ప్రత్యక్ష ఉదాహరణ. వలంటీర్ వ్యవస్థతో ఎంతో మేలు.

– కొర్రా కోములు, జాంగుడ, పోతంగి పంచాయతీ



సాంకేతిక సమస్య కారణం కావొచ్చు



జాంగుడ, బిజువారవలస గ్రామాల లబ్ధిదారులకు పింఛను అందకపోవడానికి సాంకేతిక సమస్య కారణం కావొచ్చు. గిరిజనులు వ్యవసాయ పనులు చేయడంలో చేతుల వేళ్లు గట్టిపడినందున బయోమెట్రిక్ కావడం లేదు. ఇటువంటి సమస్య వచ్చే నెలలో తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– ప్రేమ్‌సాగర్, ఎంపీడీవో, డుంబ్రిగుడ

మాచ్‌ఖండ్‌లో విదేశీయుల సందడి



ఒనకఢిల్లీ వారపు సంతలో సందడి చేస్తున్న విదేశీయులు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతమైన మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రం, ఒనకఢిల్లీ వారపు సంతలో గురువారం విదేశీయులు సందడి చేశారు. అమెరికా, ఇటలీ, జర్మనీ, దక్షిణాఫ్రికా, ఇంగ్లాండ్ తదితర దేశాలకు చెందిన విదేశీయులు ఇక్కడి జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. విద్యుత్ ఉత్పత్తి, నిర్వహణ వివరాలను తెలుసుకున్నారు. వించ్ హౌస్‌లో ప్రయాణించిన వారు ప్రత్యేక అనుభూతి పొందారు. ఒనకఢిల్లీ వారపు సంతకు వచ్చిన బోండా, గదబ గిరిజనుల సంస్కృతీ, వస్త్రధారణ వివరాలను తెలుసుకున్నారు. వారి నుంచి పూసలు, రింగులు కొనుగోలు చేశారు. వారితో ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు.

పింఛన్ల పంపిణీలో మరోసారి జిల్లాకు మొదటి స్థానం

- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: సామాజిక పింఛన్ల పంపిణీలో జిల్లా ఈనెలలో కూడా మొదటి స్థానం సాధించిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 1లక్షా 23వేల 679మంది పింఛన్‌దారులకు గాను గురువారం రాత్రి సమయానికి 1,22,752 మందికి పంపిణీ చేసి 99.25శాతం సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానం పొందామని తెలిపారు. గత నాలుగు నెలలుగా పింఛన్ల పంపిణీలో జిల్లా మొదటి స్థానం సాధించడం సంతోషంగా ఉందని, ఈమేరకు డీఆర్‌డీఏ పీడీ మురళీ, అన్ని మండలాల ఎంపీడీవోలు, ఇతర సిబ్బందికి కలెక్టర్ అభినందనలు తెలిపారు.

చట్రాపల్లి గిరిజనులకు సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు



సప్పర్ల పీహెచ్‌సీలో వైద్యసేవల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ దినేష్‌కుమార్



గొల్లపల్లి మార్గంలో నిర్మిస్తున్న వంతెన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- కలెక్టర్ దినేష్‌కుమార్
- ధారకొండ, గాలికొండ పంచాయతీల్లో పర్యటన

సీలేరు: చట్రాపల్లి గిరిజనులకు వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు నిర్మిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన గూడెంకొత్తవీధి మండలం అమ్మవారి ధారకొండ, గాలికొండ పంచాయతీల్లో ఆయన పర్యటించారు. అభివృద్ధి పనులను పరిశీలించారు. సప్పర్ల నుంచి అమ్మవారి ధారకొండ మీదుగా దుర్గం గొల్లపల్లి వరకు జరుగుతున్న రహదారి నిర్మాణం వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు.సప్పర్ల, ధారకొండ, చట్రాపల్లి తదితర గ్రామాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి నిర్మాణం పూర్తయితే మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. సప్పర్లలో గ్రామస్తులతో మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని వారు కోరారు. వీలైనంత త్వరగా సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని చట్రాపల్లి గిరిజనులకు హామీ ఇచ్చారు. ఇందుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. ఇటీవల తుపానుకు అతలాకుతలమైన గూడెం కొత్తవీధి – సీలేరు రహదారి, వంతెనల వివరాలను పంచాయతీరాజ్ డీఈ కళ్యాణ్ కుమార్ నుంచి తెలుసుకున్నారు. అనంతరం సప్పర్ల పీహెచ్‌సీని సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలపై వైద్యాధికారి నుంచి తెలుసుకున్నారు. మారుమూల ప్రాంతాల్లోని గిరిజనులకు మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాలని, వైద్యులు కూడా ఉండాలని సూచించారు. రోగులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, ఇంజినీరింగ్ అధికారులు, ఎస్‌ఐ అప్పలసూరి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయానికి మరింత ఆదరణ

చింతపల్లి ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: దేశీయంగానే కాక అంతర్జాతీయంగానూ సేంద్రియ వ్యవసాయానికి మంచి ఆదరణ, గుర్తింపు లభిస్తోందని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. గురువారం స్థానిక పరిశోధన స్థానంలో గిరిజన యువతకు సేంద్రియ వ్యవసాయంపై ఆరురోజులపాటు స్వల్పకాలిక శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ ఇతర రంగాల మాదిరిగానే వ్యవసాయ రంగంలోనూ యువత నైపుణ్యం మెరుగుపరచుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం యువతకు ధ్రువపత్రాలను జారీచేస్తామని తెలిపారు. మన్యంలో పండే ప్రధాన పంటలు , సేంద్రియ వ్యవసాయం అమలు తదితర అంశాలపై



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి

సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ బాలహుస్సేన్‌రెడ్డి, డాక్టర్ బయ్యపురెడ్డి వివరించారు. చింతపల్లి, పాడేరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు సందీప్‌నాయక్, జోగారావు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, చింతపల్లి యూబీఐ మేనేజరు శరత్ , ఆర్‌ఈఏసీ సభ్యుడు వండలం బాలయ్య పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధిలో కమిటీలు భాగస్వాములు కావాలి

చింతపల్లి: పాఠశాల అభివృద్ధిలో కమిటీలు భాగస్వాములు కావాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా పాఠశాల అభివృద్ధిలో కమిటీలు పనిచేయాలని సూచించారు. ఉపాధ్యాయులతో సమన్వయంగా వ్యవహరిస్తూ వారికి అవసరమైన తోడ్పాటు అందించాలన్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన పథకం అమలుతోపాటు మరుగుదొడ్ల నిర్వహణ, శానిటేషన్



కమిటీలతో మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

వంటి వాటిలో అవసరమైన తోడ్పాటు, సహకారం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు ప్రసాద్, బోడంనాయుడు పాల్గొన్నారు.

- మెరిసిన ముద్దుగుమ్మ



సినీ నటి మీనాక్షి చౌదరి గురువారం నగరంలో సందడి చేశారు. జగదాంబ జంక్షన్‌లో ఆర్‌ఎస్ బ్రదర్స్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమెను చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. విశాఖ అంటే తనకు ఎంతో ఇష్టమని మీనాక్షి తెలిపారు.

ఐదేళ్లలో వంద సినిమాల్లో నటించా

- సినీ నటుడు సత్యసాయి శ్రీనివాస్



పాడేరు : ఐదేళ్లలో వంద సినిమాల్లో నటించానని, వీటిలో 15 సినిమాలు విడుదల కావాల్సి ఉందని సినీ నటుడు, ఉమ్మడి విశాఖ డ్వామా పూర్వ పీడీ సత్యసాయి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక కాఫీ హౌస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ నటించిన గేమ్ చేంజర్, విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమాల్లో కూడా తాను నటించినట్టు చెప్పారు. ఈ చిత్రాలు తనకు ఎంతో గుర్తింపు ఇవ్వనున్నాయన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 19 ఏళ్ల జెడ్పీ సీఈవో, డ్వామా పీడీ, విశాఖ మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ హోదాల్లో విధులు నిర్వహించినట్టు చెప్పారు. ప్రముఖ సినీ దర్శకుడు వంశీ దర్శకత్వంలో 2017లో సినీ రంగ ప్రవేశం చేశానన్నారు. ఇప్పటివరకు వంద సినిమాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పాడేరు మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చినట్టు ఆయన తెలిపారు. పాడేరు, చింతపల్లి, అరకులోయ ప్రాంతాలు షూటింగ్‌కు ఎంతో అనువైనవని ఆయన పేర్కొన్నారు.

వణుకుతున్న మన్యం

- పెరుగుతున్న చలి తీవ్రత
- కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతలు స్థిరంగా కొనసాగుతున్నాయి. దీంతో చలిగాలుల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. గురువారం జి.మాడుగులలో 7.3 డిగ్రీలు, అరకువ్యాలీలో 8.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్, వాతావరణ విభాగం నోడల్ అధికారి ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మరియు వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ డుంబ్రిగుడలో 9.1, గూడెంకొత్తవీధిలో 9.8, పెదబయలులో10.1, ముంచంగిపుట్టులో 10.2, అనంతగిరిలో 10.8, చింతపల్లిలో 11.3, హుకుంపేటలో 12, పాడేరులో 12.1, కొయ్యూరులో 14.0 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని ఏడీఆర్ పేర్కొన్నారు.



లంబసింగిలో కురుస్తున్న పొగమంచు

న్యాయం చేసే వరకు ఆందోళన

- ప్రజాసంఘాలు, బాలిక తల్లిదండ్రులు హెచ్చరిక
- లైంగిక దాడి ఘటనపై గాంధీనగర్ ఆశ్రమ పాఠశాల ఎదుట నిరసన

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాల విద్యార్థినిపై లైంగిక దాడి ఘటనను నిరసిస్తూ ప్రజాసంఘాలు, బాలిక తల్లిదండ్రులు స్థానిక గాంధీనగర్ ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేశారు. గత నెల 25న విద్యార్థినిపై లైంగిక దాడి పాల్పడిన ఘటనపై ముగ్గురు వ్యక్తులపై స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆశ్రమ పాఠశాల యాజమాన్యంపై చర్యలు విద్యార్థిని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మహిళా సంఘ ప్రతినిధులు లతాకుమారి, కెజియారాణి, విమల, రమణమ్మ, ,గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ డిమాండ్ చేశారు. లైంగిక దాడికి ఆశ్రమ పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని వారు ఆరోపించారు. న్యాయంకోసం తల్లిదండ్రులు అధికారుల చుట్టూ తిరిగినా ప్రయోజనం లేకుండా పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు తక్షణమే బాధిత విద్యార్థి, తల్లిదండ్రులకు న్యాయం చేయాలని కోరారు. ఈ ఘటనలో విచారణకు ఉన్నతాధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటుచేయాలని వారు కోరారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేసేవరకు ఉద్యమం కొనసాగుతుందని వారు హెచ్చరించారు.



ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు, ప్రజాసంఘాల ప్రతినిధులు

క్రియ పిల్లల పండగలో ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

- బహుమతులు సాధించిన రాజవొమ్మంగి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు
- పలువురి అభినందన

రాజవొమ్మంగి: కాకినాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రియ పిల్లల పండగలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వీరిని గురువారం పాఠశాల హెచ్‌ఎం డీవీ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. జానపద నృత్యం, చిత్రలేఖనం, మ్యాప్ పాయింటింగ్, ఏకపాత్రాభినయం, కోలాటం, మట్టిబొమ్మలు, క్విజ్ తదితర పోటీల్లో పాఠశాల తరఫున సుమారు 60 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. కోలాటంలో రాష్ట్రస్థాయిలో కన్సోలేషన్‌లో ద్వితీయస్థానం సాధించినట్టు హెచ్‌ఎం తెలిపారు. అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీవీఎస్‌ఎన్. మూర్తి, శివకృష్ణ, కొండబాబు, రాజమ్మ, పోసిబాబు, సత్యంబాబు, ఏసుకుమారి, పీడీ పాల్‌బాబు, హెచ్‌ఎం గోపాలకృష్ణ, ఎస్‌ఎంసీ ఛైర్మన్ శ్రీనివాస్, వెంకటరమణ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చిన్నారులకు బాక్సింగ్‌లో తర్ఫీదు


బాక్సింగ్‌లో తర్ఫీదు పొందుతున్న చిన్నారులు

నర్సీపట్నం : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో ఎన్ఐఎస్ కోచ్‌గా సర్టిఫికెట్ సాధించిన బాక్సింగ్ క్రీడాకారిణి వేపాడ ప్రియాంక చిన్నారులకు బాక్సింగ్‌లో తర్ఫీదు ఇస్తున్నారు. మున్సిపాలిటీ పెదబొడ్డేపల్లి ఆర్‌సీఎం స్కూల్ గ్రౌండ్‌లో వుషూ, బాక్సింగ్, కరాటే, యోగాలో శిక్షణ ఇస్తున్నారు. నర్సీపట్నం రాలేని చిన్నారులు ఆర్‌సీఎం గ్రౌండ్‌లో తర్ఫీదు పొందవచ్చునని ప్రియాంక పేర్కొన్నారు. ముఖ్యంగా బాలికలు, అమ్మాయిలకు సెల్ఫ్ ప్రొటెక్షన్ టెక్నిక్‌లలో ప్రత్యేక శిక్షణ ఇస్తామన్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించేలా విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఇంటర్ వర్సిటీ పోటీలకు డైట్ విద్యార్థిని


సింధు

అనకాపల్లి : చెన్నై ఏఎంఈటీ యూనివర్సిటీలో ఈనెల 3, 4, 5 తేదీల్లో జరగనున్న అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయ టేబుల్ టెన్నిస్ పోటీలకు డైట్ కళాశాలలో మూడో సంవత్సరం సివిల్ ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థిని కె.సింధు అర్హత సాధించినట్లు కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె జాతీయ స్థాయిలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

ఆకట్టుకుంటున్న గాలిపటాలు

కశింకోట (అనకాపల్లి): స్థానికంగా రంగు రంగుల గాలి పటాల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. సంక్రాంతి వస్తుందంటే వీటిని ఎగురవేయడానికి యువకులు ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం సంక్రాంతి ముందు, తర్వాత సెలవు రోజుల్లో పిల్లలు ఉత్సాహంగా గాలిపటాలు ఎగుర వేసి ఆనందంగా గడుపుతారు. శారదా తీరం, చెరువు గట్టు, విశాలమైన వీధులు, ఇళ్ల పైన గాలిపటాలను ఎగుర వేసి ఆనందిస్తుంటారు. గరుడ పక్షి, సీతాకోక చిలుక రూపాల్లో ఆకర్షణీయంగా తయారు చేసిన గాలిపటాలను విక్రయిస్తున్నారు. అయితే ఇవి అందంగా ఉన్నప్పటికీ ధరలు మాత్రం అందనంత ఎత్తులో ఉన్నాయి. పరిమాణాన్ని అనుసరించి కనీసం రూ.60 నుంచి రూ.460 వరకు విక్రయిస్తున్నామని దుకాణదారులు చెబుతున్నారు.

తీరమంతా కళేబరాలే..


బీచ్‌కు కొట్టుకు వచ్చిన తాబేళ్ల కళేబరాలు

కొమ్మాది (విశాఖ): భీమిలి బీచ్ రోడ్డునానుకుని తీరం పొడవునా తాబేళ్ల కళేబరాలే దర్శనమిస్తున్నాయి. పెదనాగమయపాలెం, భీమిలి, ఉప్పాడ, మంగమారిపేట, తొట్లకొండబీచ్, రుషికొండ, సాగర్‌నగర్, గుడ్లవానిపాలెం, జోడుగుళ్లపాలెం తీరప్రాంతాల్లో ఎక్కడ చూసినా భారీ తాబేళ్ల కళేబరాలు పదుల సంఖ్యలో కొట్టుకు వచ్చాయి. దీంతో ఇక్కడకు వచ్చిన పర్యాటకులు ఆందోళనతో పాటు, అసహనానికి గురవుతున్నారు. తీరం మొత్తం దుర్వాసన వెదజల్లడంతో ఇబ్బంది పడుతున్నారు. దీనిపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో జోన్-1, జోన్-2 పారిశుధ్య సిబ్బంది గురువారం కళేబరాలను తొలగించారు. వ్యాన్‌లు ఏర్పాటు చేసి, ఈ కళేబరాలను తరలించి, ఆయా ప్రాంతాలను శుభ్రం చేశారు.

విశాఖ జ్యోతి.. జాతీయ కీర్తి



- అడ్డంకులు దాటి.. అర్జున అవార్డుకు ఎంపికైన జ్యోతి యర్రాజీ
- పాఠశాల నుంచి ఒలింపిక్స్ స్థాయికి ఎదిగిన స్ఫూర్తిదాయక ప్రస్థానం
- జిల్లా అథ్లెటిక్ సంఘం, జిల్లా ఒలింపిక్ సంఘం హర్షం

విశాఖ స్పోర్ట్స్ :

ఆర్థికంగా స్థిరమైన స్థితిలో లేకపోయినా.. జ్యోతి చిన్నప్పటి నుంచే ఆటల పట్ల ఆసక్తి పెంచుకుంది. జాతీయ స్థాయిలో రాణించాలని కలలుకంది. ఆమె తండ్రి సూర్యనారాయణ సెక్యూరిటీ గార్డుగా, తల్లి ఇళ్లలో సహాయక పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. జ్యోతి పోర్టు ఉన్నత పాఠశాలలో చదువుతున్న సమయంలో ఆటల పట్ల ఆసక్తి కనబరిచింది. పాఠశాలలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ప్రారంభించడంతో స్కూల్ గేమ్స్‌లోనే పతకం సాధించింది. తొలుత స్ప్రింట్‌లోని మూడు విభాగాల్లో పాల్గొనేది. ఆ తర్వాత రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ శిక్షణ శిబిరంలో పాల్గొనడంతో జాతీయ స్థాయిలో పోటీపడింది. 2019లో గుంటూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చేరింది. అప్పటి వరకు జాతీయ స్థాయిలో పోటీ పడుతున్నా ఆశించిన ఫలితాలు రాలేదు. ఆ సమయంలో రిలయన్స్ పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో అథ్లెటిక్స్‌కు శిక్షణ ప్రారంభమవుతుందని తెలియడంతో దరఖాస్తు చేసుకుంది. అప్పటికే జాతీయ స్థాయిలో పతకం ఉండటంతో శిబిరంలో స్థానం సంపాదించింది. అక్కడి నుంచి వెనుదిరిగి చూడలేదు. ఒక్కో మెట్టు ఎక్కుతూ.. జాతీయ రికార్డులు నెలకొల్పడం, అంతర్జాతీయ స్థాయిలో రాణించి పతకాలు సాధించడంతో జాతీయ మహిళా ఫాస్టెస్ట్ హర్డిలర్‌గా నిలిచింది. ఒకే ఏడాదిలో అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ ప్రపంచ ర్యాంకింగ్‌లో 24వ స్థానానికి చేరుకుని.. ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తొలిసారి ప్రపంచ మేటి వుమెన్ హార్డిలర్స్ పోటీని ఆస్వాదించింది. ప్రస్తుతం ముంబయిలో శిక్షణ శిబిరంలో ఉన్నానని, అర్జున అవార్డుకు ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉందని జ్యోతి 'సాక్షి'తో చెప్పింది.

జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం, ఒలింపిక్స్‌లో పాల్గొనడం జ్యోతికి కీర్తిని తెచ్చిపెట్టిందని జిల్లా అథ్లెటిక్ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది. భారత ప్రభుత్వం నుంచి అర్జున అవార్డు పొందడం గర్వించదగ్గ విషయమని జిల్లా ఒలింపిక్ సంఘం మరో ప్రకటనలో అభినందనలు తెలిపింది.

ఆనందానికి అవధుల్లేవు

ఆర్థికంగా వెసులుబాటు లేకపోయినా.. ఆటల్లో పాల్గొనేందుకు జ్యోతిని ప్రోత్సహించాం. శాప్‌లో ప్రత్యేక శిక్షణకు అర్హత సాధించినప్పుడే తొలిసారిగా విశాఖను విడిచి వెళ్లింది. అప్పటి నుంచి ఒడిదుడుకులు ఎదుర్కొంటూనే అనుకున్న లక్ష్యానికి చేరుకుంది. అర్జున అవార్డు వచ్చిందని జ్యోతి చెబుతుంటే మా ఆనందానికి అవధులు లేవు. ఇంటికి సైతం రాకుండా అకాడమీలో శిక్షణ తీసుకుంటోంది.

– సూర్యనారాయణ, జ్యోతి తండ్రి

రికార్డులను తిరగరాసింది

అథ్లెటిక్స్‌లో అర్జున అవార్డు పొందడం పూర్తిగా వ్యక్తిగత ప్రతిభతోనే సాధ్యమవుతుంది. అథ్లెటిక్స్‌లో టైమింగ్ చాలా కీలకం. క్షణంలో ఫలితం తారుమారవుతుంది. అలాంటి ట్రాక్ ఈవెంట్‌లో అంతర్జాతీయ పతకాలు సాధించాలంటే ఎంతో కఠోర శ్రమ ఉండాలి. రికార్డును నిలబెట్టుకోవడం సులభం కాదు. అలాంటి రికార్డును జ్యోతి తిరగరాసింది.


– ఐ.వెంకటేశ్వరరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత

మరిన్ని విజయాలు సాధించాలి

పాఠశాల, జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనడం మొదలుకొని ప్రతి రోజూ పోర్ట్ స్టేడియంలో కలిసి శిక్షణకు వెళ్లేవాళ్లం. సాయంత్రం వేళల్లో వ్యాయమాలు చేసేవాళ్లం. తోటి క్రీడాకారిణులతో ప్రతీవారం పోటీలు జరిగేవి. జ్యోతితో పోటీపడేవాళ్లం. జ్యోతి శాప్ శిక్షణకు ఎంపికైంది. అలా జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తూ నేడు అర్జున అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది. ఆమె మరిన్ని విజయాలు సాధించాలి.

– పూజిత, పాఠశాలలో తోటి క్రీడాకారిణి

అలల జోరు.. విన్యాసాల హోరు


పేలిన రిగ్


యుద్ధ ట్యాంకర్ల హోరు

- అబ్బురపరిచిన నౌకాదళ విన్యాసాలు
- 4న తుది విన్యాసాలకు ఏర్పాట్లు

కడలిపై కదన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. బీచ్‌రోడ్డులోని విశ్వప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా సాగరతీరంలో గురువారం జరిగిన నావికాదళ పూర్తిస్థాయి విన్యాసాలతో నగరవాసులు సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. దాదాపు గంటన్నరపాటు కనులార్పకుండా ప్రజలు వీటిని వీక్షించారు. భారత నావికాదళం తమ సాయుధ సంపత్తిని ప్రజలకు తెలిపే విధంగా ఈ విన్యాసాలు సాగాయి. 15 యుద్ధ విమానాలు, జలాంతర్గామి, పలు నౌకలు పాల్గొన్నాయి. తొలుత మూడు హెలికాప్టర్లు భారత జాతీయ పతాకాన్ని, నావికాదళ పతాకాన్ని గగనతలంలో ఎగురవేస్తూ.. ప్రయాణించడంతో కార్యక్రమం ప్రారంభమైంది. వెంటనే ఐదు హాక్ విమానాలు గగనతలంలో గర్జిస్తూ కనువిందు చేశాయి. మెరైన్ కమాండోలు హెలికాప్టర్ నుంచి ఎంతో చాకచక్యంగా సముద్రంలోకి దిగి, అక్కడి నుంచి జెమిని బోట్లలో తీరానికి చేరుకుని బందీలను విడిపించారు. తిరిగి సముద్రంలోకి వెళ్లిపోవడం ఎంతో ఆసక్తిని కలిగించాయి. ఆయిల్ రిగ్‌ను విజయవంతంగా పేల్చి సముద్రంలో జరిగే యుద్ధాలను కళ్లకు కట్టినట్లు చూపించారు. భారత్‌లో తయారైన ఎల్‌సీఎం హెలికాప్టర్ నుంచి పారాచూట్‌ల సహాయంతో మెరైన్ కమాండోలు ఎంతో చాకచక్యంగా కిందకు దిగిన విధానం ఆకట్టుకుంది. ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ మైసూర్, ఐఎన్ఎస్ ఢిల్లీ నౌకలపై చేతక్ హెలికాప్టర్లు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు దిగిన తీరు అబ్బురపరిచింది. అనంతరం రెండు హాక్ విమానాలు రెండు వైపులా వాయువేగంతో దూసుకువెళ్లడం, ఏంజెల్స్‌గా పిలిచే చేతక్ హెలికాప్టర్లు ఎంతో సమన్వయంతో చేసిన విన్యాసాలు, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్‌లో అత్యవసర, విపత్తు సమయాల్లో ప్రజలను రక్షించే విధానం చూపిన తీరు అదరహో అనిపించింది. అనంతరం సీ కేడెట్ కార్ప్స్ నృత్యం, నౌకల నుంచి నమూనా ఫైరింగ్, బాణం ఆకారంలో


హెలికాప్టర్ విన్యాసాలు

వెళ్లిన ఏఎల్‌హెచ్ విమానాలు, డార్నియర్ విమానాల శ్రేణి, పీహెచ్ఐ విమానం, జెట్ ఫైటర్‌ల విన్యాసాలు అందరిలో ఉత్సుకతను పెంచాయి. చివరిగా నావికాదళం బీటింగ్ రిట్రీట్ కార్యక్రమం జరిగింది. విద్యుత్‌కాంతులతో, నౌకలు మెరిసిపోయాయి. నావికాదళ సైనికులు చేసిన కవాతు ప్రజల మనసుల్లో నిలిచిపోయింది. ఈ విన్యాసాలను నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి వీక్షించారు. నావికాదళ తుది దశ విన్యాసాలు ఈ నెల 4వ తేదీన జరగనున్నాయి.

– ఏయూ క్యాంపస్

జాయింట్ సర్వేను వేగవంతం చేయండి

జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ

పాడేరు రూరల్: జాయింట్ సర్వే పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పాడేరు జాయింట్ కలెక్టర్ అభిషేక్‌గౌడ తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయం నుంచి అటవీశాఖ, రెవెన్యూ, బీఎస్ఎన్ఎల్, జియో, ఎయిర్‌టెల్ సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సెల్ టవర్లు నిర్మాణానికి ఎదురవుతున్న స్థల వివాద సమస్యలపై అధికారులందరూ సమన్వయంతో జాయింట్ సర్వే ప్రక్రియ చేసి పరిష్కరించాలన్నారు. ఇందుకు సంబంధించిన సర్వే వివరాలను వెంటనే ఇవ్వాలని గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు, కొయ్యూరు మండలంలో 6 సెంట్లు భూ సమస్య, హుకుంపేట మండలంలో కూడ స్థల సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఎక్కడ స్థల సమస్యలున్నా తక్షణమే పరిష్కరించాలని తహసీల్దార్‌లను ఆదేశించారు. జియో సెల్ టవర్లు నిర్మాణానికి ఇంకా 14 టవర్లకు అనుమతులు ఇవ్వాలని అధికారులను కోరారు, వీటిలో 8 అనుమతులు ఫారెస్ట్ శాఖ నుంచి రావాల్సి ఉందన్నారు, పెండింగ్ జాయింట్ సర్వేలు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సర్వే పనుల్లో ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. సబ్ కలెక్టర్ సౌర్యమన్‌పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ, గిరిజన సంక్షేమ శాఖ ఈఈలు వేణుగోపాల్, డేవిడ్, పంచాయతీరాజ్ ఈఈ కొండయ్యపడాల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా మ్యూటేషన్లు


కిన్నంగుడలో మాట్లాడుతున్న చినబాబు

అరకులోయటౌన్: గిరిజన ప్రాంతంలో జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన పట్టా మ్యూటేషన్‌లను డెత్ , ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌లను మినహాయించి, గ్రామ స్థాయిలో పంచనామ నిర్వహించి తదనుగుణంగా పట్టా మ్యూటేషన్ నిర్వహించాలని ఏపీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు, సుంకరమెట్ట సర్పంచ్ గెమ్మెలి చినబాబు అన్నారు. మండలంలోని సుంకరమెట్ట పంచాయతీ కిన్నంగుడ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సులో పాల్గొని మాట్లాడారు. పట్టా మ్యూటేషన్‌కు డెత్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ప్రమాణికం చేయడంతో గత మూడు తరాలుగా పట్టా మ్యూటేషన్‌కు గిరిరైతులు నోచుకోవడం లేదన్నారు. గిరిజన ప్రాంతంలో కుటుంబ పెద్ద మరణిస్తే డెత్ సర్టిఫికెట్ తీసుకోవలన్నా విషయం అమాయక గిరిజనులకు తెలియక తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. గ్రామాల్లో సభలు నిర్వహించి, పంచనామ రాయించుకొని మ్యూటేషన్ చేయాలని సూచించారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ విధానాన్ని మార్చాలని చినబాబు డిమాండ్ చేశారు. వీఆర్‌ఓ అమ్మలు,. రెవెన్యూ సిబ్బంది, గిరిరైతులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్లాంట్‌ను రద్దు చేయాలి

విశాఖ పర్యటనలో మోదీ ప్రకటన చేయాలన్న సీపీఎం


గిరిజనులతో సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి లోకనాథం

దేవరాపల్లి: మండలంలోని చింతలపూడి, నగరంపాలెం ప్రాంతాలలో నిర్మాణం తలపెట్టిన అదానీ హైడ్రో పవర్ ప్లాంట్‌ను అడ్డుకుని తీరుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం హెచ్చరించారు. చింతలపూడి ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టు నిర్మించబోయే స్థలాన్ని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి. వెంకన్నతో కలిసి ఆయన పరిశీలించారు. స్థానిక గిరిజనులకు చేటు కలిగించే ఈ ప్రాజెక్టును నిర్మించవద్దని డిమాండ్ చేస్తూ భారీగా హాజరైన గిరిజనులతో కలిసి నిరసన చేపట్టారు. సీపీఎం నాయకులు మాట్లాడుతూ నగరంపాలెం గ్రామంలో అటవీ ప్రాంతం ఉందని జలజీవన్ మిషన్ పథకం పైపులైన్ పనులను అడ్డగించిన ఫారెస్టు అధికారులు అదానీ ప్రాజెక్టుకు ఎందుకు అడ్డు చెప్పడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో రైవాడ, కోనాం ప్రాజెక్టులకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయకట్టు భూములన్నీ ఏడారిగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ నెల 9న విశాఖలో పర్యటించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైడ్రో పవర్ ప్లాంట్ రద్దుకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

7న దేవానంద స్వామీజీ ఆరాధన మహోత్సవం

- కొత్తపెంట స్వామీజీ ఆశ్రమంలో భారీగా ఏర్పాట్లు


కొత్తపెంటలో సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ విగ్రహం

దేవరాపల్లి : శ్రీ సద్గురు దేవానంద సరస్వతీ స్వామీజీ మహరాజ్ (రుషీకేష్) 25వ ఆరాధన మహోత్సవాలను కొత్తపెంటలోని స్వామీజీ ఆశ్రమంలో ఈ నెల 7న అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు స్థానిక సర్పంచ్ రొంగలి వెంకటరావు(నీలిమ) తెలిపారు. దేవానంద స్వామీ ఆధ్యాత్మిక జీవన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆయన స్పష్టం చేశారు. స్వామీజీ 25 ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకొని భారీగా భక్తజనం హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ నెల 5 నుండి పూజులు, భజన కార్యక్రమాలను ప్రారంభించి ఆఖరి రోజు 7న ముగుస్తాయన్నారు. ఈ ఆరాధన మహోత్సవానికి దేశ వ్యాప్తంగా స్వామీజీ భక్తులు, శిష్యులు, సాధు సత్పురుషులు అధిక సంఖ్యలో తరలివస్తారన్నారు. ఆరాధన మహోత్సవాలకు పలు ఆశ్రమాల పీఠాధిపతులు హాజరై ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తారన్నారు. ఆఖరి రోజు 7న స్వామీజికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, భగవద్గీత పారాయణం, మహాత్ముల ప్రవచనాలు, భారీ అన్నసమారాధన ఉంటాయన్నారు.

ప్లేట్ నంబరు మార్చి గంజాయి తరలింపు

- 110 కేజీల ప్యాకెట్లతో కారు పట్టివేత
- ఇద్దరు రాజస్థాన్ నిందితుల అరెస్టు


పట్టుబడిన గంజాయి, కారుతో పోలీసులు

ఎస్.రాయవరం: మండలంలో 110 కిలోల గంజాయి ప్యాకెట్లు పట్టుబడింది. దీని విలువ రూ.20 లక్షల వరకు ఉంటుందని నక్కపల్లి సీఐ రామకృష్ణ గురువారం తెలిపారు. సీఐ వివరాల ప్రకారం... అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారి ఆనుకున్న లేఅవుట్ వద్ద అనుమానాస్పదంగా ఆగిఉన్న కారును తనిఖీ చేయడంతో గంజాయి పట్టుబడింది. రాజస్థాన్‌కు చెందిన ఇరువురు కారు (ఏపీ40బీహెచ్3733)లో అడ్డురోడ్డు మీదుగా వేంపాడు టోల్ గేట్ దాటాల్సి ఉండగా, అక్కడ తనిఖీలు చూసి వెనక్కి వచ్చారు. అడ్డురోడ్డు సమీపంలో వెంకటేశ్వర లాడ్జి వద్ద లేఅవుట్‌లో కారు నిలిపారు. ఆగి ఉన్న కారును ఎస్.రాయవరం ఇన్‌చార్జిగా బాధ్యత తీసుకున్న, కోటవురట్ల ఎస్ఐ రమేష్ తన సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశారు. కారు నంబర్ ప్లేట్ కింద ఒరిజినల్ నంబర్ ఆర్‌జే30సీబీ8575గా గుర్తించారు. అనంతరం కారు డిక్కీలో 22 ప్యాకెట్లలో 110 కేజీల గంజాయి లభించింది. ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు జాతీయ రహదారిపై తరచూ వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కారు పట్టుబడింది. ఇదేక్రమంలో ఇకపై తనిఖీలు యథావిధిగా ఉంటాయని సీఐ తెలిపారు. పట్టుబడిన నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

విద్యార్థికి అభినందనలు


హేమచంద్రన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ చంద్రశేఖర్

యలమంచిలి రూరల్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ పోటీల్లో యలమంచిలి గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎస్.హేమచంద్రన్ కాంస్య పతకం సాధించి ప్రతిభ కనబరిచాడు. గత నెల 23 నుంచి 26 వరకు నేపాల్ ఖాట్మాండ్ కవర్డ్ హాల్‌లో యెనెక్స్ సన్‌రైజ్ నేపాల్ ఇంటర్నేషనల్ ఛాలెంజ్ బీడబ్ల్యూఎఫ్ 2024 పోటీల్లో బాలుర డబుల్స్ విభాగంలో భారత్ తరపున పోటీల్లో పాల్గొన్న హేమచంద్రన్ సత్తా చాటాడు. కాంస్య పతకం సాధించడంపై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.చంద్రశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ వై.పోలిరెడ్డి గురువారం అభినందించారు. హేమచంద్రన్ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న హేమచంద్రన్ బ్యాడ్మింటన్‌లో శిక్షణ నిమిత్తం విశాఖపట్నంలో కోచ్ వద్దకు వెళ్లినట్టు వారు తెలిపారు.

జీసీసీ గోడౌన్,పెట్రోల్ బంక్‌లో తనిఖీ


కాఫీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్

జి.మాడుగుల: మండలం కేంద్రంలోని జీసీసీ గోడౌన్ని తనిఖీ చేసి. బియ్యం, ఇతర సరకుల నిల్వలను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ గురవారం పరిశీలించారు. గోడౌన్ భవనం శిథిలావస్థలో ఉండడంతో తక్షణమే భవన మరమ్మతులకు అంచనాలతో ప్రతిపాదనలు పంపించమని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. గాంధీనగరంలో గల జీసీసీ ఆధ్వర్యంలో ఉన్న పెట్రోల్ బంక్‌లను తనిఖీ చేశారు. పెట్రోల్ సేల్స్ రిజిష్టర్ బిల్లులు, లేకపోవడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. జీసీసీ డీఎం పర్యవేక్షణ లేదని ఆయన చెప్పారు. సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.బంక్ నిర్వహణపై పలు సూచనలిచ్చారు. ఊబలగరువులో కాఫీ రైతులతో సమావేశమై జీసీసీ కొనుగోలు చేస్తున్న కాఫీ ధరల వివరాలను వివరించారు. కాఫీ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి, టూరిజం డైరెక్టర్ రమేష్‌నాయుడు, జీసీసీ డైరెక్టర్ నాగరాజు, ఎస్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిట్టిబాబు పాల్గొన్నారు.

3 వేల లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

నర్సీపట్నం: మండలంలోని ధర్మసాగరం గ్రామ శివారుల్లో సారా తయారీ స్థావరాలపై రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ ఆదేశాల మేరకు ఎస్సై రాజారావు, సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. మూడు వేల లీటర్ల బెల్లపు పులుపును ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి పాల్పడినా, అమ్మకాలు సాగించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

పల్నాడు దొంగ జంట మోసం

- పరిచయం పెంచుకుని దొంగతనాలు
- అచ్యుతాపురంలో రూ.2.80 లక్షల తస్కరణ
- గతంలో పిఠాపురం, చోడవరంలోనూ చోరీలు
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ సత్యనారాయణ


రికవరీ చేసిన నగదుతో మాట్లాడుతున్న డీఎస్పీ సత్యనారాయణ

అచ్యుతాపురం: బంగారు వస్తువుని చూపించి నమ్మబలుకుతారు. ముఖ్యంగా వాణిజ్య దుకాణదారుల్ని లక్ష్యంగా చేసుకుని పరిచయాలు పెంచుకుంటారు. ముందుగా దుకాణం వద్దే బంగారం వస్తువు ఉంచడంతో నమ్మకంగా భావించిన దుకాణదారులు వారితో మాట్లాడే సమయంలో దొంగ జంటలో ఒకరు నగదు తస్కరిస్తారు. ఇలా మూడు ప్రాంతాల్లో దొంగతనాలు చేసిన పల్నాడు జిల్లాకు చెందిన జంటను అచ్యుతాపురం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. పోలీసులు సేకరించిన సమాచారం, డీఎస్పీ సత్యనారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం...

నమ్మించి మోసం చేస్తున్న దొంగ జంట...

పల్నాడు జిల్లాకు చెందిన యూ సత్యనారాయణ, కల్యాణి భార్యాభర్తలమని చెప్పి అచ్యుతాపురంలోని ఒక బట్టల దుకాణం నిర్వాహకులతో పరిచయం పెంచుకున్నారు. గత నెలలో ఒకసారి వచ్చి బంగారం బిస్కట్ లాంటి వస్తువుని ఇచ్చి అమ్మిపెట్టాలని, తమ కుటుంబంలో వారి వివాహానికి బట్టలు కొనుగోలు చేయాల్సి ఉందని చెప్పి వెళ్లిపోయారు. కొద్ది రోజుల తర్వాత (డిసెంబర్ 18న) దుకాణం వద్దకు వచ్చిన భార్య నిర్వాహకులను మాటల్లో పెట్టి బట్టలు చూస్తుండగా, భర్త దుకాణంలోని రూ.2.80 తస్కరించాడు. భార్య కూడా మరో రూ.80 వేలు చోరీ చేసింది. వారిద్దరూ అక్కడి నుంచి చల్లగా జారుకున్న తర్వాత మోసపోయామని గుర్తించిన యజమాని అచ్యుతాపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ గణేష్, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది మల్లేశ్వరరావు, బంగారయ్య గురువారం అచ్యుతాపురంలో అనుమానంగా సంచిరిస్తున్న నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద సొమ్మును, బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. పల్నాడుకు చెందిన వీరిద్దరు భార్యాభర్తలు కాదని గుర్తించారు. గతంలో వీరు పిఠాపురం, చోడవరం ప్రాంతాల్లో చోరీ చేసి, అచ్యుతాపురంలోనూ తతంగం పూర్తి చేశారు. ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. ఇటువంటి గుర్తు తెలియని వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవ్వరినీ నమ్మవద్దని డీఎస్పీ సత్యనారాయణ హెచ్చరించారు.